
# గుర్తింపు

## గుడిసేవ సుందరరామయ్య



"మమ్మీ!" అన్న పిలుపు వినగానే వ్రాస్తున్న కథను ఆపి తలెత్తి చూసేను.

ఎదురుగా బాబ్జీగాడు కన్పించాడు.

తల వంచుకొని నేల చూపులు చూస్తూ, చేతులు వెనక్కి కట్టుకొని నిలబడ్డాడు. వాడలా నిలబడ్డాడంటే ఏదో అడగటానికి వచ్చాడన్న విషయం నాకు తెల్సు!

"ఏం కావాలిరా?" అని అడిగాను పెన్‌కు క్యాప్ పెడ్తూ.

"మరి...మరి...మమ్మీ! స్కూటర్ కావాలి!"

"ఎవరికి? నీకే?" అని అడిగాను నవ్వుతూ.

"కాదు మమ్మీ డాడీకి!"

"నువ్వు జాగ్రత్తగా చదువుకొని పెద్ద డాక్టర్ అయితే నేను స్కూటర్ తప్పకుండా కొనిపెడ్తాను రా?"

"అదేంకాదు! ఇప్పుడే కావాలి!" అన్నాడు మూంగమూతి పెట్టి. ఆ పోజులో వాడెంతో ముద్దొస్తాడు: దగ్గరకు తీసుకొని ఒడిలో కూర్చోబెట్టుకొన్నాను.

"ఏం మమ్మీ? స్కూటర్ కొందామా?" నా కళ్లల్లోకి చూస్తూ అభ్యర్థించాడు.

"స్కూటర్ కొనాలంటే వెంటనే జరిగే పని కాదురా! డబ్బు కావాలి ముందు!"

"అందుకు స్పెషల్‌గా నువ్వో అరడజను నవలలు రాసెయ్ మమ్మీ?"

"నీ తెలివి తేటలకు సంతోషించాను కాని డబ్బులుంటే సరిపోదురా మంచి స్కూటర్ కొనాలంటే కొన్ని సంవత్సరాలు ఆగాలి!"

"మరి మన ఎదురింటి బ్యాంకు ఆఫీసర్ గారు మొన్నేగా స్కూటర్ కొన్నారు!"

వాడు చెప్పింది నిజమే! ఆయన బ్లాక్‌లో కొన్నారు. ఆ విషయం వీడికి చెబితే మనం కూడా అలాగే కొందాం అంటాడు.

"అవునా! వారు ఎన్నో సంవత్సరాల క్రితం అప్లై చేశారు, ఇప్పుడు వచ్చింది!"

"అయితే స్కూటర్ కొనవా?" అంటూ ఒళ్లోంచి దిగి గబ గబ మెట్ల దగ్గరకు పరిగెత్తాడు.

వాడు వెళ్లిన దిక్కే చూస్తూండి పోయాను.

కాలం నడుస్తున్న కొద్దీ, మనిషి కోరికలకు బానిస అవుతున్నాడన్పిస్తోంది. ఒక కోరిక తీరితే మరో కోరిక పుట్టుకొస్తుంది. ఆ కోరిక కూడా తీరితే ఇంకో కోరిక! దీనికి అంతం ఎక్కడ? జీవితాంతం మనిషి ఏదో ఓ కోరిక తీర్చుకోటం కోసం తపించాల్సిందేనా? కోరికలు కల్గకుండా మనసును అదుపులో పెట్టుకోటం మనిషికి సాధ్యం కాదా?

నా ఆలోచనలకు నేనే నవ్వుకొన్నాను. మనిషికి కల్గే కోరికలు గమ్మత్తుగా వుంటాయి. స్వతహాగా కల్గే కోరికలు కొన్ని వుంటే, ఇంకొకరి పరిస్థితిని చూశాక కల్గే కోరికలు మరికొన్ని! ఈ కోరికలు వయసును బట్టి మారుతూ వుంటాయి.

మా బాబ్జీగాడు సంవత్సరం క్రితం ఇలాగే నా దగ్గరకు వచ్చి 'మమ్మీ! మనం ఎక్వేరియమ్ అర్జంటుగా కొనాలి!' అన్నాడు

'ఎందుకురా?' అని అడిగాను

'మన పక్కింటి వాసుగాడింట్లో వుందిగా! వాడెప్పుడూ రంగు రంగుల చేపల గురించి గర్వంగా చెబుతాడు. వాళ్ళ ఎక్వేరియమ్‌లో వున్నన్ని చేపలు ఎక్కడా లేవంట! వాడలా మాట్లాడుతూ నా ముందు కాలరెత్తుకొని నిలబడితే నేను తల దించుకోవాల్సి వస్తోంది!'

అంతే! వెంటనే ఆ రోజు సాయంత్రం మా యింట్లో ఎక్వేరియమ్ చోటు చేసుకుంది.

ఆరునెలల క్రితం చిన్నమ్మ వచ్చి 'మమ్మీ నాకు వెంటనే సింగర్ మిషన్ కావాలి! మా స్కూల్లో చదువుతున్న ఆడపిల్లలందరి యిళ్ళల్లో వున్నాయి. మనింట్లో లేదని చెప్పుకోవాలంటే సిగ్గుగా వుంది!' అంది.

శ్రీవారికి వచ్చిన బోనస్ డబ్బు పెట్టి చిన్నమ్మకు మిషన్ కొన్నాను. 'మన వీధిలో యింటి యింటికీ ఓ టేప్ రికార్డర్ వుందోయ్! మనింట్లో లేకపోవటం కొంచెం వెలితిగా వుంది ఓ నవల రాయకూడదూ స్పెషల్‌గా!' అన్నారాయన ఓ వెన్నెల రాత్రి డాబా మీద ఏకాంతంగా వున్నప్పుడు.

ఓ వారపత్రిక నిర్వహించిన నవలల పోటీలో నేను పాల్గొనటం, అందులో ప్రయిజ్ రావటం, శ్రీవారి కోరిక తీర్చటం గమ్మత్తుగా జరిగిపోయింది.

నిజం చెప్పాలంటే మా యింట్లో అడపా తడపా ప్రతి ఒక్కరు మనసులోని కోరికలు తీర్చుకొంటూనే వున్నారు. గమ్మత్తేమిటంటే వాళ్ళ కోరికలకు కామాలే కాని ఫుల్‌స్టాప్‌లు వుండటం లేదు. ఈ రోజు బాబ్జీగాడు స్కూటర్ కొందామన్నాడు. నిన్న చిన్నమ్మ రాళ్ళ నెక్లెస్ కావాలంది. మొన్న శ్రీవారు టి. వి. కూడా కొంటే బాగుంటుందోయ్! అన్నారు.

మా ఇంట్లో ఏ కోరికా లేనిదాన్ని నేనొక్కదాన్నే!

"మమ్మీ! రాజేష్ అంకుల్ వచ్చాడు!" అంటూ చిన్నమ్మ పరిగెత్తుకు వచ్చింది.

నలుపు చేసిన తెల్లకాగితా లన్నింటినీ సరిచేసి, ఫైలులో బంధించి పేపర్ వెయిట్ పెట్టి లేచి నిలబడ్డాను.

"కిందికి తీసుకురానా?" అని అడిగింది చిన్నమ్మ.

"అక్కర్లేదులే! అలా వుండనివ్వు!" అనేసి మేడ దిగాను.

రాజేష్ మా యింటికి రావటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. మా శ్రీవారు గబగబా గేటు తెరుచుకొని బయటకు వెళ్ళారు రాజేష్‌ను రిసీవ్ చేసుకోటానికి. నేను కూడా ఆయన వెనకే నడిచాను. రోడ్డుమీద బిస్కట్ కలర్లో వున్న కారు కన్పించింది. అప్పుడే షోకేసులోంచి బయటకు తీసినట్టుంది. రాజేష్ కార్లోంచి దిగి ఠీవిగా డోర్ పుచ్చుకొని నిలబడివున్నాడు. బ్లాక్ ప్యాంట్‌మీద ఎర్రటి గళ్ళ షర్టు టక్ చేశాడు చేతిలో సిగరెట్ వెల్గుతూంది. ఆకాశంలోకి పొగను వదుల్తూ కళ్ళతోనే "హాయ్ ఆనంద్!" అని శ్రీవారిని పలకరించాడు. శ్రీవారు అతని దగ్గరకు వెళ్ళి నిలబడ్డారు.

"అక్కడే నిలబడిపోయారే ఇద్దరూ! లోపలికి రండి!" అన్నాను నేను.

వాళ్ళిద్దరూ లోపలికివచ్చి సోఫాలో కూర్చున్నారు. నేను లోపలికి వెళ్ళి ఫ్రిజ్ లోంచి కూల్‌డ్రింక్స్ తెచ్చి టీపాయ్ మీద పెట్టాను.

"కారు బాగుందా?" అని అడిగాడు రాజేష్ డ్రింకు త్రాగుతూ నా ముఖంలోకి చూస్తూ.

"వేలకువేలు ఖర్చుపెట్టి కొన్నప్పుడు ఎందుకు బాగుండదు!" అన్నాను నేను కారు వైపుకు చూస్తూ.

"ఆఫ్టరాల్ సెవన్టీ!"

ఎంత తేలికగా అనేశాడు?

నిజమే! అతనిలాంటి భాగ్యవంతులకు వేలు పైసల్లా కన్పిస్తాయి.

"కలర్ చాలా బాగుందండీ!" అంటున్నారు శ్రీవారు.

"థాంక్స్!" అన్నాడు రాజేష్ గర్వంగా నావైపు చూస్తూ.

"చెల్లెల్ని కూడా తీసుకు రావల్సింది" అన్నాను.

"సునీ ఎప్పుడూ బిజీగానే వుంటుంది. మన్వేదో రచయిత్రివి కాబట్టి ఇంటిపట్టునే ఉండి కథలు రాసుకొంటూ కూర్చుంటావ్! ఆవిడగారేమో లేడీస్ క్లబ్ సెక్రటరీ కదా! అపాయింట్‌మెంట్ దొరకటమే కష్టం!"

"అవునవును!" అంటూ తలాడిస్తున్నారు శ్రీవారు. నాకైతే ఒళ్ళు మండిపోయింది.

ఎదుటివ్యక్తిని కించపరుస్తూ మాట్లాడే వాళ్ళంటే నా కసహ్యం! ఎవరి గొప్పవారిది! ఒక్కొక్కరికి ఒక్కో రంగంలో ప్రావీణ్యం వుంటుంది! ఆ సరస్వతీదేవి కటాక్షం వలన నేను ఈనాడు రచయిత్రి కాగల్గాను. అలానే లక్ష్మీదేవి కటాక్షం వలన సునీత సెక్రటరీ కాగలిగింది.

సాహిత్య రంగంలో నేను సంపాదించుకొన్న పేరు సునీత సంపాదించుకోగలదా?

అలానే ఆర్థిక పరంగా వాళ్ళ స్థాయికి నేను ఎదగకల్గుతానా? లేదు! అక్కర్లేదు! నాకా డబ్బు అక్కర్లేదు!

ఉన్నదాంతో సరిపెట్టుకొని నా కుటుంబమంతా హాయిగా జీవించకల్గితే చాలు!

నాకా విలాస జీవితం పట్ల ఆశలేమీలేవు. అలాంటి ఆశలే ఉన్నట్టయితే అతి సామాన్య కుటుంబంలో పుట్టి, ఆర్డనరీ ఉద్యోగం చేస్తున్న ఆనంద్‌రావ్‌నెలా పెళ్ళాడి వుండేదాన్ని?

నాన్నగారి మాటలు నా చెవుల్లో ఇంకా మ్రోగుతున్నాయి. 'అనూ! నీ అభిరుచులు ఆదర్శాలు నాకే కాదు ఈ ప్రపంచంలో అందరికీ నచ్చుతాయమ్మా! ఆనందరావ్‌నే పెళ్ళి చేసుకోవాలని నీవు తీసుకొన్న నిర్ణయాన్ని మరోసారి ఆలోచించుకోమ్మా! నీవు చిన్నప్పట్నుంచీ కలవారి కుటుంబంలో పుట్టడంచేత ఎంతో గారాబంగా పెరిగావు. పెళ్ళయ్యాక ఆనందరావ్‌కు వచ్చే జీతంతో ఎడ్జస్ట్ కావాలంటే నీవు కొన్ని సుఖాలను, సౌకర్యాలను త్యాగం చేయాలమ్మా! రాజేష్ బావకూడా నీవంటే ఎంతో యిష్టం! నిన్ను ఎంతో అభిమానంతో చూసుకొంటాడు. ఆలోచించుకో!'

'డాడీ! మీరన్నట్టు, ఆనందరావ్ పేదవాడే! అతన్ని చేసుకొంటే నేను కొన్ని విషయాల్లో కాంప్రమైజ్ కావాలని కూడా తెల్సు! అందుకు నేను సిద్ధమే! లెక్కలేనంత డబ్బున్న రాజేష్ లాంటి మనుషుల కంటె అంతులేని అనురాగాన్ని కల్గివున్న ఆనందరావ్ లాంటి వాళ్ళంటే నా కిష్టం! డబ్బు తెచ్చిపెట్టే కృత్రిమ సుఖాలకన్న ఆప్యాయతను కురిపించే పేదరికమే నయం! అందుచేత ఆనందరావ్‌నే వివాహం చేసుకోటానికి నిర్ణయించుకొన్నాను!'

"ఏమిటోయ్! అలా బాపు బొమ్మలా

నిలబడిపోయావ్!" అంటూ శ్రీవారు ప్రశ్నించే సరికి వర్తమానంలోకి వచ్చాను.

"మావయ్య బ్రతికుంటే కారు చూసి ఎంత మురిసిపోయేవాడో?" అనేశాను వెంటనే ఆయన గురించే ఆలోచిస్తున్నానన్న భావన కల్గాలనే ఉద్దేశ్యంతో.

"దేనికైనా అదృష్టం వుండాలి అనూ! నే వెళ్తాస్తా! గుడ్‌నైట్ ఆనంద్!" అంటూ రాజేష్ వెళ్లిపోయాడు.

"మమ్మీ! కారు చాలా బాగుంది కదూ! మనక్కూడా అలాంటిది వుంటే బాగుంటుంది కదూ!" అన్నాడు బాబీగాడు.

'ఏడిశావులే వెధవ! నీ మనసు నిండా కోరికలే!" అని మందలించాను.

"ఒరేయ్! మీ మమ్మీ ఆ అంకుల్‌ను చేసుకొని వుంటే ఇంతకంటే పెద్దకారు కొని వుండేది!" శ్రీవారు బాబీగాడితో అంటున్నారు.

"స్టాప్!" అన్నాను కోపంగా.

"అదేమిటోయ్! అంత కోపం వచ్చింది? జోక్ చేశాను! అంతే!"

"జీవితాల మీద జోక్స్ వేస్తే ఫలితాలు దారుణంగా వుంటాయండీ! కొన్ని కొన్ని ఆలోచనలు మనసులోకి పొరపాటున కూడా చోటు చేసుకోకూడదు! ఏ మాత్రం బీజం వేసుకొన్నా అనుమానంగా మారి మహా వృక్షాలై కాపురాలనే కూల్చదోస్తాయి!"

శ్రీవారు నవ్వు కొడుతూ "చాలా బాగుందోయ్! నీవు రాస్తున్న కొత్త నవలకి ఓపెనింగ్ డైలాగ్స్ యివేనా? సూపర్బ్!" అన్నారు.

"డోంట్ టేకిట్ యీజీ! సీరియస్‌గా అడుగుతున్నాను. నిజం చెప్పండి? నే నెప్పుడైనా కారు కొనుక్కోవాలనుకొన్నానా!"

"లేదు!"

"మరెందుకన్నారు, రాజేష్‌ను చేసుకొంటే కారుండేదని!"

"చెప్పానుగా జోక్ చేశానని!" నవ్వుతూ అన్నారు.

"ఇప్పుడంటే అన్నారు. ఇకముందెప్పుడూ అలాటి జోక్స్ వేయకండి. మిమ్మల్నిచేసుకొని బాధ పడుతున్నానేమో నన్న అనుమానం మీ మనసులో ఇకముందు కల్గటానికి వీలేదు! మానసికంగా నేనెంత సంతృప్తి పొందుతున్నానో మీకు తెలీదు! అనురాగాన్ని, ఆప్యాయతలని పంచి యిచ్చే భర్త, ముత్యా

## గుర్తింపు

ల్లాంటి పిల్లలు, అందమైన ఇల్లు— నాకు ఇంకేం కావాలండీ? నేనెంతో ఆనందంగా వున్నానన్న విషయం రాజేష్‌క్కూడా తెల్సు! ఈ సంతృప్తి తన భార్యకు లేదని కూడా అతనికి తెల్సు! అయినా తన ఐశ్వర్యాన్ని, గొప్పతనాన్ని బయట పెట్టుకొని మనల్ని బాధ పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడు. మన పెళ్లయి యిన్నేళ్లయిందికదా? అతను మనింటికి ఎన్నిసార్లు వచ్చాడో చెప్పండి! ఈనాడు కారు కొన్నాడు. ఆ విషయం మనందరికీ తెలియజేసి మనం బాధ పడితే చూసి ఆనందించాలని వచ్చాడు. తన స్టేటస్‌ను బహిర్గతం చేసుకోవాలని తపన పడుతున్నాడు! గుర్తింపు కోసం పాకులాడుతున్నాడు! ఇలాంటి వాళ్ళంటే నాకు అసహ్యం! అతను సరిగ్గా ఏది ఆశించాడో అదే ఆలోచన మీలో కల్గింది. అందుకే నేను బాధపడుతున్నాను!" నా కళ్ళ వెంట నీళ్లు వచ్చాయి.

ఆయన దగ్గరగా వచ్చి నా కన్నీళ్ళను తుడుస్తూ "ఏమిటోయ్! చిన్న పిల్లలా! అభ్యుదయ భావాలుగల రచయిత్రివి నీవు! ఇలా పిరికిదానిలా కంటతడి పెట్టుకొంటున్నావా? దిసీజ్ టూ బాడ్!" అన్నారు.

కొన్ని నిముషాలు మౌనంగా గడిచాక ఆయన మెల్లగా అన్నారు. "అనూ! రాజేష్ ఇలా రావటంలో నాకేమీ తప్పు కన్పించటం లేదోయ్! గుర్తింపు కోసమే అతను ఇక్కడకు వచ్చాడన్నావు కదూ! అది నిజమే! అయితే మనిషై పుట్టాక ప్రతి ఒక్కరికీ పది మందిలో గుర్తింపు పొందాలనే తహతహ కల్గుతుంది. అది సహజం! కొంత మంది తమ విద్యతో గుర్తింపు పొందితే, మరికొంత మంది తమ తెలివితేటలతో గుర్తింపు పొందుతారు. కొంతమంది పదవులతో, ఇంకొంతమంది డబ్బుతో గుర్తింపు పొందటానికి ప్రయత్నిస్తారు. ఉదాహరణకు నా విషయమే తీసుకో! ఫలానా నవలారచయిత్రి అన్నపూర్ణగారి భర్త అని నన్నెవరైనా పరిచయం చేస్తే ఏదో గుర్తింపు కల్గినట్లుగా నేనెంతో పొంగిపోతాను!"

"అయితే గుర్తింపబడాలనే తపన ప్రతి ఒక్కరికీ వుంటుందంటారా?"

"తప్పకుండా!"

"నా విషయంలో కూడా ఋజువు చేస్తారా?"

"నీ విషయంలోనా?" అంటూ రెండు క్షణాలు ఆలోచించి—

"డెఫినెట్లీ! అయితే ముందుగా కొన్ని ప్రశ్నలడుగుతాను చెప్పు?"

"అడగండి!"

"డబ్బు సంపాదించటమంటే నీ కిష్టం లేదు కదూ!"

"అవసరాలకు మించి సంపాదించటం నా కిష్టంలేదు!"

"గుడ్! అయితే ఈనాడు నీవు పేరు ప్రతిష్టలున్న రచయిత్రివి! పేరు పొందాలనే తపనతోటే కదా నీవిన్ని నవలలు రాసింది?"

"ఎన్నటికీ కాదు! సంఘంలో జరుగుతున్న అత్యాచారాలు, అనర్థాలు నా మనసును కదిలించి నాలోని రచయిత్రిని రెచ్చగొట్టి నా చేత కలం పట్టించాయి అంతేకాని మీరు ఊహిస్తున్నట్లు నాకు కీర్తి కండూతి లేదు!"

"వెరీగ్గుడ్! వన్‌మినిట్! నాతో అలా వస్తావా!" లేచి నిలబడ్డారు.

మెట్లు దిగి గేటు తీసి బయటకు నడిచారు శ్రీవారు. ఆయన వెనుకే వెళ్ళాను.

"మైడియర్ అన్నపూర్ణా! 'గుర్తింపు' సంపాదించుకోవాలన్న తపన ప్రతి మనిషికి వుంటుంది. అది రూలు! దానికి నువ్వు ఎక్సెప్షన్ కాదు! చెట్టంత మగాణ్ని ఇంట్లో వున్నాను కదా! మరి ఈ ప్రహరీ గోడకు ఆ ఒక్క బోర్డ్ మాత్రమే వుండటానికిగల కారణం ఏమిటి?" అంటూ గోడకు తగిలించి వున్న నేమ్ బోర్డ్‌ను చూపించారు.

"జి అన్నపూర్ణ, తెలుగు నోవలిస్ట్'అన్న అక్షరాలు నన్ను వెక్కిరించాయి.

### వర్గ స్వభావం

రుషి చేతిలో
పులిగా మారిన పిల్లి
పులే అవుతుంది
పిల్లిలా బతకదు
నవ కుబేరుడూ అంతే.

—ఎస్. మునిసుందరం